ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

ఆదివారం 17 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	1,99,544	1,96,976
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.30 (3.78)	10,098	8,633
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.5530 (40.5852)	1,66,154	1,96,778

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.225

చేపపిల్లల పంపిణీ ఎన్నడో?

- భారీ వర్షాలతో చెరువుల్లోకి చేరుతున్న వరద
- ఇప్పటికే అలుగుపోస్తున్న పలు చెరువులు
- చేప పిల్లల పంపిణీకి నేటికీ పూర్తికాని టెండర్ల ప్రక్రియ



మత్స్యకారులకు ఉపాధి కల్పించి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఏటా చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. జిల్లాలో తాజాగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. అయితే జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఎన్నడు ప్రారంభమవుతుందోనని మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. ఆగస్టు నెల వచ్చినా నేటికీ టెండర్ల ప్రక్రియ ప్రారంభించకపోవడంతో సీజన్ దాటుతుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి చేప పిల్లల పంపిణీ చేపట్టాలని కోరుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, సూర్యాపేట టౌన్



భారీ వర్షాలతో నిండి అలుగుపోస్తున్న ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరులోని సుబ్బసముద్రం చెరువు

సూర్యాపేటటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపపిల్లల పంపిణీ పథకం ఎప్పుడు ప్రారంభమవుతుందోనని మత్స్యకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించి ఆదుకునేందుకు గత ప్రభుత్వం చేపట్టిన చేపపిల్లల పంపిణీ పథకం అమలులో జాప్యం జరుగుతోంది. పదేళ్ల క్రితం కుల వృత్తులపై ఆధారపడి జీవించే కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపపిల్లల పంపిణీని ప్రారంభించింది. గతంలో జిల్లాలోని పలు చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపట్టారు. చేపల పెంపకం ద్వారా వచ్చే ఆదాయం ఆయా చెరువుల పరిధిలోని సొసైటీ సభ్యులకు చెందుతుంది. అయితే ఆగస్టు నెల వచ్చినా నేటికీ టెండర్ ప్రక్రియ పూర్తిచేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువుల్లోకి నీరు చేరింది. అయితే వరద నీరు సమయమైన జూన్, జూలై నెలలో టెండర్ పూర్తిచేసి చేపలను వదిలితే ప్రస్తుత వరద నీరు వాటి ఎదుగుదలకు ఉపయోగపడేది. టెండర్ ప్రక్రియ ప్రారంభించి చేపలను చెరువుల్లో వదిలేందుకు 20 నుంచి 30 రోజుల సమయం పడుతుంది. సమయం దాటిన తర్వాత చేపలను వదిలితే ఎదుగుదల అంతగా ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై మత్స్యకారులకు చేపల పిల్లలను సరఫరా చేస్తుంది.

ఏటా తగ్గుతున్న పెంపకం

జిల్లాలో 2022-23లో 579 చెరువుల్లో 2.43కోట్ల చేప పిల్లలను వదిలారు. అదేవిధంగా 2023-24లో 648 చెరువుల్లో 3.38 కోట్లు, 2024-25లో 315 చెరువుల్లో 1.01కోట్ల చేపలను వదిలారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న చెరువులతో పాటు ఇరిగేషన్‌శాఖ ఆధీనంలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకం చేపట్టారు. అయితే వాటిని సంరక్షించే బాధ్యత మత్స్యకారులు చేపడతారు.

జిల్లాలో మొత్తం 154 మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి. మొత్తం 15,540 మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేపల పెంపకం పథకం ద్వారా మత్స్య కార్మికుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. అదేవిధంగా చేపల పెంపకం అనంతరం వచ్చే ఆదాయాన్ని మత్స్యకారులు పొందుతారు. దీంతో మిగతా 8వ పేజీలో...

మార్కెట్‌లో లెక్కల

మాయాజాలం



- ధరలు, తూకం సక్రమంగానే ఉన్నా లెక్కల్లో తేడాలు
- వాస్తవ బిల్లులపై సుమారు 20శాతం దోపిడీ
- నష్టపోతున్న వినియోగదారులు
- అప్రమత్తతతోనే నివారణ సాధ్యమంటున్న నిపుణులు

పట్టణానికి చెందిన ఓ ఉద్యోగి రైతు బజార్‌కు వెళ్లాడు. ఎప్పుడూ కొనుగోలు చేసే వ్యాపారి వద్దే కుటుంబానికి సరిపడా కూరగాయలు కొనుగోలుచేశాడు. కొనుగోళ్లు పూర్తయ్యాక ఆ వ్యాపారి కాలిక్యులేటర్‌లో లెక్కచేసి చెప్పిన రూ.345 చెల్లించి కవర్‌తో ఆ ఉద్యోగి బైక్ వద్దకు వచ్చాడు. ఎందుకో అతడికి ఎక్కువ చెల్లించినట్టు అనుమానం వచ్చింది. వెంటనే వ్యాపారి వద్దకు వెళ్లి కాగితంపై లెక్క వేయించాడు. రూ.43 తేడా వచ్చింది. ఆ ఉద్యోగి ఆగ్రహం వ్యక్తం చేయగా, పొరపాటైందని రూ.43 తిరిగి ఇచ్చేశాడు. ఇలా నిత్యం ఎంతోమంది వినియోగదారులు మోసానికి గురవుతున్నారు.

భువనగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మనకు చేప్పే ధర, తూకం సక్రమమే.. కానీ చివరికి వేసే లెక్కలు.. కూడికల్లో తేడాలుంటున్నాయి. కొసరి కొసరి కొనుగోలు చేశామని మనం లోలోన ఫీల్ అవుతుంటాం. మరికొందరు తమ టాలెంట్‌ను నలుగురికి చెప్పుకొని గర్వంగా ఫీల్ అవుతుంటారు. ఇదంతా నాణానికి ఒక వైపైతే మరోవైపు పలువురు వ్యాపారులు కొనుగోలుదారుల నుంచి అసలుకు మించి రాబడుతున్నారు. ఇదేమీ తెలియని వినియోగదారులు వ్యాపారులు చెప్పినంతగా చెల్లిస్తున్నారు. కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు ధర తెలుసుకొని డబ్బు చెల్లించి లెక్కలను సరి చూసుకుంటేనే అధిక చెల్లింపులను నియంత్రించవచ్చని వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

మాల్స్, పెద్ద వాణిజ్య సంస్థల్లో కంప్యూటర్ బిల్లింగ్ ఉంటుంది. కానీ మెజార్టీ ప్రజలు నిత్యం సందర్శించే కిరాణం, ఇతర దుకాణాలు, పండ్లు, పువ్వులు మిగతా 6వ పేజీలో...

నేడు జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటన



హుజూర్‌నగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేడు జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పాలకవీడు మండలం రాఘవాపురంలో వ్యవసాయ యూనివర్సిటీకి సంబంధించి స్థలాన్ని పరిశీలించ నున్నారు. అనంతరం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మగ్దుమ్‌నగర్‌లోను వ్యవసాయ యూనివర్సిటీ నిర్మాణానికి గతంలో పరిశీలించిన భూమిని మరోసారి పరిశీలించనున్నారు. సాయంత్రం 5గంటలకు పట్టణంలోని ముత్యాలమ్మ జాతర సందర్భంగా పోచమ్మతల్లి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయనున్నారు. ఆదివారం రాత్రి హుజూర్‌నగర్ పట్టణంలో క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ బస చేయనున్నారు. ఈ నెల 18వ తేదీన సోమవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో సిటీ స్కాన్, డయాలసిస్ సెంటర్ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఏరియా ఆసుపత్రిలో కొత్త ఓపీ బ్లాక్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి ఎన్‌ఎస్‌పీ క్యాంప్‌లో 9.40 గంటలకు ఇరిగేషన్ శాఖకు సంబంధించి భవనాల సముదాయానికి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.20 గంటలకు విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం 11 గంటలకు కోదాడలోని కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో సోషల్‌మీడియా వారియర్స్‌తో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు.

నగల దుకాణంలో చోరీ ఘటనలో 6

మరో ఇద్దరి అరెస్టు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కలెక్టరేట్‌లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమే‌ష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ వేణారెడ్డి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 16, (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమే‌ష్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో సూర్యాపేట, చివ్వెంల మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరు పత్రాలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ హుజూర్‌నగర్ నుంచి, రేషన్‌కార్డుల పంపిణీ తిరుమలగిరి నుంచి ప్రారంభించడం హర్షణీయమన్నారు. చివ్వెంల మండలంలో 1856 రేషన్‌కార్డులు, 526 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, సూర్యాపేట మండలంలో 1654 రేషన్‌కార్డులు, 740ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు అందించినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ పరిశీలించి రేషన్‌కార్డులు మంజూరు చేస్తారన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం అందించడం సంతోషమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు రేషన్‌కార్డులో ఎంతమంది ఉన్నా నలుగురికి మాత్రమే నాలుగు కిలోల చొప్పున బియ్యం ఇచ్చారని, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడగానే కార్డులో ఎంత మంది ఉన్నా ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున బియ్యం అందించామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు త్వరగా ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని ఇంటి గృహప్రవేశానికి తనను ఆహ్వానించాలన్నారు. రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమే‌ష్‌రెడ్డి మాట్లాడుతూ పేదవారి ఆత్మగౌరవానికి రేషన్‌కార్డులు చిహ్నం అన్నారు. జిల్లా నుంచి సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ నాయకుడు ఆలోచించని విధంగా ధనవంతులతో పాటు పేదవారు కూడా సన్నబియ్యం తినాలనే ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డి రావడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున ఐదేళ్లలో మొత్తం 20లక్షల ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డీఎస్‌వో మోహన్‌బాబు, హౌసింగ్ పీడీ సిద్దార్థ, డీఈ జబ్బార్‌అహ్మద్, నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, ధరావత్ వీరన్ననాయక్, కక్కిరేణి శ్రీనివాస్, చింతమళ్ల రమేష్, ఏఈ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : ఎమ్మెల్యే

పెన్‌పహాడ్: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ పటేల్ రమే‌ష్‌రెడ్డి, అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగునీటి అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమే‌ష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాలను క్రమేపీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నబియ్యం, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి అర్హులైన పేదవారిని ఆదుకుంటుందన్నారు. అదనపు కలెక్టర్ పి. రాంబాబు మాట్లాడుతూ మండలంలో కొత్తగా 1476 రేషన్‌కార్డులు, 613 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి, పటేల్ రమే‌ష్‌రెడ్డి లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసిడింగ్ పత్రాలు అందజేసి వేదికపై నుంచి వెళ్లిన తర్వాత పది నిమిషాలకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి వేదికపైకి వచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవరావు, ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక అధికారి ఎల్. శ్రీనివాసరావు, తసీల్దార్ ధరావత్‌లాలునాయక్, ఎంపీడీవో జానయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాళేశ్వరంపై ప్రభుత్వానివి అబద్ధాలు

● మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు16, (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షపు నీళ్లతో రైతులు పంటలు సాగు చేశారని, కొద్దిరోజులైతే నీళ్లలేక పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తదని అప్పుడు నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు ఏపీ సీఎం చంద్రబాబు ప్రసంగానికి కొనసాగింపుగా ఉందన్నారు. గోదావరిలో నీళ్లు లేవని చెప్పకుండా కాళేశ్వరం లేదని చెప్పడం అంటే బనకచర్లకు మద్దతు ప్రకటించడమేనన్నారు. కాళేశ్వరం నుంచి 240 టీఎంసీలకు పైగా నీళ్లను వాడుతున్నామని చెప్పాల్సింది పోయి గోదావరిలో నీళ్లు లేవని చెప్పడంలోని అంతర్యమేమిటన్నారు. వాస్తవంగా గోదావరిలో మిగులు నీళ్లు లేవు కాబట్టి పక్కన ఉన్న రాష్ట్రాల్లో నిర్మించే ప్రాజెక్టులను నిరాకరించాలన్నారు. బనకచర్లకు అనుమతులు రావాలంటే కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డులో నుంచి మాయం చేయాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఉన్న నందిమేడారం, కన్నెపల్లి, గాయత్రి పంప్‌హౌస్‌లను ప్రారంభించారంటే కాళేశ్వరం ప్రాజెక్టు అంతా బాగున్నట్లేనన్నారు. కాళేశ్వరం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎనిమిది పంటలకు నీళ్లు ఇచ్చినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయకట్టు ప్రాంతాలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దేవాదుల నుంచి నీళ్లు తుంగతుర్తికి తెస్తామని కొత్త పాట అందుకున్నాడని ఎద్దేవా చేశారు. దేవాదుల నుంచి నీళ్లు ఇస్తామని ఇదివరకే చెప్పిన ప్రాంతానికే ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. మావేశంలో ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పుట్టా కిశోర్‌కుమార్, సవరాల సత్యనారాయణ, జీడి భిక్షం, తాహేర్‌పాష, బత్తుల జానీయాదవ్, సుంకరి రమేష్, బత్తుల ప్రసాద్, లింగంపల్లి శ్రీను, గాలి సాయికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర



హుజూర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతిపెద్ద రెండో జాతరగా ప్రసిద్ధి చెందిన హుజూర్‌నగర్ ముత్యాలమ్మ జాతర ఆదివారం ప్రారంభం కానుంది. మూడురోజుల ముత్యాలమ్మ జాతరకు అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం పెద్ద ముత్యాలమ్మకు, సోమవారం చిన్నముత్యాలమ్మ, గురువారం కనకదుర్గమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ జాతరకు సుమారు లక్షమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ముత్యాలమ్మ దేవాలయాలను రంగురంగుల విద్యుద్దీపాలు, కాషాయ తోరణాలతో అలంకరించారు. ఆలయాల ప్రాంగణాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆదివారం తెల్లవారు జామున 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పించడంతో పాటు సాయంత్రం 5గంటల నుంచి సుమారు 300 ప్రభలతో రైతులు జాతరలో ప్రదక్షిణ చేయనున్నారు.

ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు. జాతర సందర్భంగా 300 పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సీఐ చరమందరాజు, ఎస్ఐ మోహన్‌బాబుయాదవ్ తెలిపారు. ప్రధాన కూడళ్ల ఇందిర సెంటర్, పాత బస్టాండ్, పొట్టి శ్రీరాములు సెంటర్, గాంధీపార్క్, రామాలయం సెంటర్, పీర్లచావిడి, జంగిడి బజారు, మట్టపల్లి రోడ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణాలలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. గోవిందపురం, రెడ్డిబజార్, మట్టపల్లి రోడ్డుల నుంచి వచ్చే భక్తులకు మినీ ట్యాంక్‌బండ్ వద్ద వసతులు కల్పించారు. జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు తండు ప్రసాద్, కంచర్ల అరవింద రెడ్డి, వేముల నర్సయ్య, రామిశెట్టి రాము, తండు సైదారత్నం, పశ్య శ్రీనివాస్‌రెడ్డి, గుండా రమేష్, కోట సూర్యప్రకాశ్‌రావు కోరారు.

● వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు 8



కృష్ణాష్టమిలో భాగంగా కోదాడలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

ముగిసిన దండుమైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు





ఆలయాల పరిసమాప్తి సందర్భంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతి, వేదాశీర్వచనం, కుంభం పోసి అమ్మవారిని దేవాలయంలోకి పంపించారు. దేవాలయ కమిటీ చైర్మన్ తంగేళ్ల కర్ణాకర్‌రెడ్డి, ఈవో కుశలయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం గ్రామంలోని భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.

ఇదిలా ఉండగా, దండు మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవాలు నిరుత్సాహం కనిపించింది. 2023లో నూతన ఆలయంతో పాటు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, 2024లో అదేస్థాయిలో ఉత్సవాలు భారీగా కొనసాగాయి. చైర్మన్ పదవి స్థానికులకు రాలేదని, ఉత్సవాల్లో పాల్గొనడానికి ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. వర్షాల కారణంగా భక్తులు కూడా తక్కువగానే కన్పించారు.

ప్రత్యేక సాగుకు అరుదైన గౌరవం

● వస సాగుకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పాలకవీడు మండల వాసి



పాలకవీడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం బెట్టెగూడెం గ్రామానికి చెందిన కందుకూరి నాగిరెడ్డి వస సాగు చేసి(చిన్న పిల్లలకు వస తయారు చేసే మొక్కలు) జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. నాగిరెడ్డి హైదరాబాద్‌లో లార్డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ మండలంలోని బెట్టెగూడెం గ్రామంలో తనకున్న తొమ్మిది ఎకరాల్లో వస సాగు చేస్తూ, వస నూర్పిడి విధానంలో కొత్త పద్ధతులు అవలంబి స్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వస సాగులో సలహాలు, సూచనలు ఇస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినారు. నాగిరెడ్డి సేవలను గుర్తించిన జాతీయ ఔషధ మొక్కల బోర్డు కేంద్ర ప్రభుత్వం అనుమతితో ఢిల్లీ ఎర్రకోటలో జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక అహ్వానితుడిగా పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి సేవలో..





- పచ్చని పొలాల నడుమ ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిరం నిర్మాణం
- హిమాలయల్లో సాధువు సూచనతో మందిరం నిర్మించిన వెంకటేశ్వర్లు
- సంపాదనంతా కృష్ణ మందిరం నిర్వహణకే



శ్రీకృష్ణుడికి మందిరం

ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగం చేసుకుంటూ కుటుంబం జీవితం ఆనందంగా ఉండాలని చాలా మంది కోరుకుంటారు. కానీ హిమాలయాల్లో ఓ సాధువు సూచనతో శ్రీకృష్ణుడికి మందిరాన్ని నిర్మించి ఆధ్యాత్మిక బాటలో పయనిస్తున్నాడు ఓ యువకుడు. ఐఐటీ చదివి ఉన్నత ఉద్యోగాన్ని వదిలి భక్తి సేవలో తరిస్తున్నాడు. తన జీవితం శ్రీకృష్ణుడి సేవకే అంకితమంటూ సొంత వ్యవసాయ పొలంలో శ్రీకృష్ణుడి మందిరాన్ని నిర్మించి స్వామివారి సేవలో తరిస్తున్నాడు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం తాళ్ళవెల్లంల గ్రామానికి చెందిన పామనగుళ్ళ వెంకటేశ్వర్లు.

– ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్

గ్రామానికి చెందిన పామనగుళ్ళ యాదయ్య-జయమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్వర్లు గేట్ ఏఐఆర్ ప్రవేశ పరీక్షలో 114వ ర్యాంకును సాధించి అసోం రాష్ట్రంలోని గౌహతిలో ఐఐటీలో మాస్టర్స్ పూర్తి చేశారు. తర్వాత ఐఐటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీని ప్రారంభించారు. అకడమిక్ గౌరవాలకంటే శ్రీకృష్ణుడి సేవలే ఉన్నతమైనవని ఆధ్యాత్మిక త వైపు పయనాన్ని ఆరంభించారు. ఉన్నతమైన ఉద్యోగం కోసం భారతదేశంలోని పలు కళాశాలలు, యూఏఈలో కూడా విద్యార్థులకు విద్యాబోధనలు చేస్తుంటారు. ఐఐటీ, జేఈఈ కోసం ఆర్గానిక్ కెమిస్ట్రీ ఫ్యాకల్టీగా మెంటరింగ్‌గా చేస్తున్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా విద్యాబోధన చేస్తుంటారు. చదువు మధ్యలో ఆపి తన జీవితాన్ని భక్తి మార్గంలో నడిపిస్తూ శ్రీకృష్ణుడి సేవలో నిమగ్నమయ్యాడు. ఆశ్రమాలు, ద్వారక, పూరి, ఉడిపి, మధుర, బృందావనం వంటి శ్రీకృష్ణుడికి చెందిన క్షేత్రాల్లో గడిపి సాధువుల వద్ద భక్తి సాంప్రదాయాలు నేర్చుకున్నారు. తన స్వగ్రామంలో రెండెకరాల్లో పచ్చని పొలాల మధ్య శ్రీకృష్ణుడికి మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరాన్ని ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిరంగా పిలుస్తున్నారు. వివిధ జిల్లాలు, హైదరాబాద్‌కు చెందిన భక్తులు మందిరాన్ని సందర్శించుకుంటారు.

సేవా కార్యక్రమాలు

తాను నిర్మించిన ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిరంలో వెంకటేశ్వర్లు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పండుగలు నిర్వహిస్తారు. కల్యాణ మహోత్సవాలు చేపడతారు. ఆరు నెలలు శ్రీకృష్ణుడి మందిరంలో సేవా కార్యక్రమాలు.. మరో ఆరు నెలలు హైదరాబాద్‌లోని కళాశాలల్లో విద్యాబోధనలు చేస్తుంటారు. తన సంపాదనంతా శ్రీకృష్ణుడి మందిరానికే ఖర్చు చేస్తుంటారు.

సాధువు సూచన మేరకు మందిరం నిర్మాణం

2015లో పామనగుళ్ళ వెంకటేశ్వర్లు ఒక హిమాలయ సాధువును కలిశారు. ఆయన సూచన మేరకు మందిరాన్ని నిర్మించాలనే ఆలోచన తట్టింది. తన వద్ద డబ్బులు లేకపోవడంతో బ్యాంకులో రూ.2లక్షలు వ్యక్తిగత రుణం తీసుకుని మందిరం నిర్మాణాన్ని మొదలు పెట్టారు. తాను దుబాయ్‌లో ఉద్యోగం చేస్తూ సంపాదించిన డబ్బుతో పాటు స్నేహితుల సహకారం, ఆర్థిక సహాయంతో 2024లో శ్రీకృష్ణ మందిరాన్ని నిర్మాణాన్ని పూర్తి చేశారు. తన స్నేహితుడు కళ్యాణ్‌చౌదరికి మందిరం నిర్మాణం గురించి చెప్పగా ఆయన తన భార్య నగలను తాకట్టు పెట్టి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కళ్యాణ్‌చౌదరి

జీవితం శ్రీకృష్ణుడి సేవకే అంకితం



మనకు జీవితాన్నిచ్చింది శ్రీకృష్ణుడే. ఆయనకు మనం ఏమి ఇవ్వగలం. నిద్రలేచినప్పటి నుంచి మళ్లీ నిద్రించడం వరకు శ్రీకృష్ణుడి సేవలో తరలించడం తప్ప ఇంకేమీ ఉండదు. నేను చేసే పనులన్నీ ఆయన ఆదేశించినదే. ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో ప్రయణించాలి. ఆయనను స్మరిస్తూ సేవలందించడమే కాకుండా ఇతరులకు కూడా సేవలందించాలి.

– పామనగుళ్ళ వెంకటేశ్వర్లు, తాళ్ళవెల్లంల గ్రామం.



ఉన్నత ఉద్యోగంలో స్థిరపడి మరో మారు రూ.10లక్షలు అందజేశారు. మందిర నిర్మాణానికి పాఠశాలలు, కళాశాల స్నేహితులు ఎం. రాజేంద్ర (ఐఐటీ), అమర్‌నాథ్, ధార కృష్ణ,.సాయికృష్ణ, అలుగోజు కృష్ణ, వి. శంకర్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, రఘుబాబు, ఫణీశ్వర్, చంద్రశేఖర్, హరీష్, నిషారెడ్డి, ఎం. శ్వేతరెడ్డి ఆర్థిక సాయం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



రామకృష్ణ(ఫైల్)

రాజాపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్థులు, ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రాజాపేట మండల కేంద్రానికి చెందిన పెంట రామకృష్ణ(42) పవరులూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలం క్రితం భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో భార్య లావణ్య తన పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి రామకృష్ణ ఒంటరిగానే ఉంటున్నాడు. హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ మూడు రోజుల క్రితం రాజాపేటకు వచ్చాడని గ్రామస్థులు తెలిపారు. రామకృష్ణ ఉంటున్న ఇంట్లో నుంచి శనివారం సాయంత్రం దుర్వాసన వస్తుండడంతో చుట్టు పక్కల వారు గమనించి గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి చూడగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



శంకర్ మృతదేహం

చింతపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని గాయపడిన విద్యార్థి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోత్యతండా గ్రామపంచాయతీలోని కొక్కిరాల గౌరారం గ్రామానికి చెందిన రమావత్ శంకర్(23) డిగ్రీ చదువుతున్నాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సాగర్-హైదరాబాద్ రహదారిపై వస్తుండగా పెట్రోల్ కోసం వెంకటాంపేట స్టేజీ వద్ద ఉన్న బంకులోకి వెళ్తున్న క్రమంలో మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శంకర్ శనివారం మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శంకర్ తండ్రి రమావత్ తార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటినుంచి స్వర్ణరథ ప్రారంభోత్సవ పూజలు

• ముస్తాబైన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం



స్వర్ణరథం

దేవరకొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని వాసవీ ఆలయ ప్రాంగణ కల్యాణ మండపంలో స్వర్ణరథం ప్రారంభోత్సవ పూజలు ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రోడ్లు, భవనాల శాఖ మం త్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఫర్ హోం రవిగుప్తా హాజరవుతారని ఆలయ స్వర్ణ రథ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పానగంటి మల్లయ్య, కార్యదర్శి వనపర్తి మురళి తెలిపారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, గోమాత పూజ, ధ్వజారోహణం, అఖండ దీపారాధనం, అగ్నిప్రతిష్ఠ, హోమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నల్లగొండ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ పిలుపు మేరకు నల్లగొండ కలెక్టరేట్ ఈ నెల 18న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు నాగమణి పిలుపు నిచ్చారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని అన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

• గొంతుపై పదునైన గాయం • పలు కోణాల్లో విచారిస్తున్న పోలీసులు



శ్రీనివాస్ ఈశ్వర్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): డిగ్రీ చదువుతున్న విద్యార్థి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన మాదగోని సత్యనారాయణ, నాగమణి దంపతుల కుమారుడు శ్రీనివాస్ ఈశ్వర్(19) పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ముత్తిరెడ్డికుంటలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లి సాయంత్రం ఇందిరమ్మకాలనీలోని తల్లిదండ్రుల వద్దకు బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యలో శ్రీనివాస్ ఈశ్వర్ అనుమానాస్పదంగా మృతిచెంది రోడ్డుపై పడి ఉన్నాడు. కాలనీ శివారులో యువకుడు మృతిచెందాడన్న సమాచారం తెలుసుకున్న స్థానికులు ఘటన స్థలం వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి సత్యనారాయణ కుమారుడిగా గుర్తించి సమాచారమిచ్చారు. తల్లిదండ్రులు అక్కడకు చేరుకొని తన కుమారుడి మృతదేహాన్ని చూసి బోరుమని విలపించారు. అయితే సంఘటన జరిగిన ప్రదేశంలో శ్రీనివాస్ ఈశ్వర్ నడుపుతున్న బైక్ సమీప పొలాల్లో సుమారు 50 అడుగుల దూరంలో పడి ఉంది. గొంతుపై పదునైన కత్తితో కోసిన గాయంతో తన కుమారుడు మృతిఉండడాన్ని పరిశీలించిన తల్లిదండ్రులు గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైనట్లుగా అనమానిస్తున్నారు. శ్రీనివాస ఈశ్వర్ మృతి వెనుక ప్రేమ వ్యవహారం, ఇతర కారణలతో హత్య చేసి ఉండవచ్చని తల్లిదండ్రులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ రంగరాజు, సీఐలు మోతీరాం, సోమనర్సయ్య, టీఎన్‌డీ ప్రసాద్ పరిశీలించారు. మృతికి దారితీసిన కారణాలపై పలు కోణాలు విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోతీరామ్ తెలిపారు.

పేర్లు మార్చి.. డబ్బులు దోచి

• సీఎంఆర్‌ఎఫ్‌లో అక్రమాలు
• ఆరుగురి అరెస్టు, రూ.9.30లక్షల నగదు స్వాధీనం
• వాడని ఎనిమిది చెక్కులు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి)లో అక్రమాలకు పాల్పడిన ఆరుగురిని సూర్యాపేట జిల్లా కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9.30లక్షల నగదు, వాడని 8 చెక్కులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ కేసు వివరాలు వెల్లడించారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ క్యాంపు కార్యాలయంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి చెడపంగు నరేష్, మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ వద్ద పీఏగా పనిచేసే మేళ్లచెర్వు మండలం వేపలమాదారం గ్రా మానికి చెందిన మర్ల వీరబాబు, మోతె మండలం సర్వారం గ్రామానికి చెందిన ఉప్పల మధు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసే విషయాలను పర్యవేక్షించేవారు. 2023 నవంబరులో శాసనసభ ఎన్నికల కోడ్ వస్తుందని భావించి నరేష్, వీరబాబు, మధు, వారి వెంట తిరిగే మునగాల మండల నారాయణగూడెం గ్రామానికి చెందిన సూరగాని రాంబాబుతో కలిసి వివిధ పేర్లతో అప్పటికే మంజూరైన 44 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వకుండా పక్కన పెట్టారు. ఆ చెక్కులను రీవ్యాలిడేషన్ చేయించుకుని అదే పేర్లతో ఉన్న వేరే వ్యక్తుల పేర వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేయించి తీసుకోవాలని పథకం పన్నారు.

పేర్లు మార్చారిలా...

హైదరాబాద్‌లో ఓ ప్రభుత్వ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వరంగల్ జిల్లా రంగశాయిపేటకు చెందిన (ప్రస్తుతం హైదరాబాద్‌లోని బతుకమ్మకుంట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు) గుంటుక సందీప్‌ను వీరంతా కలిశారు. అతడి ద్వారా చెక్కులను రీవ్యాలిడేషన్ చేయించి అదే పేర్లతో ఉన్న ఇతరులను చూసుకుని వారిబ్యాంకు ఖాతాల్లో చెక్కులు జమ చేయించి డబ్బులను అసలు లబ్ధిదారులకు ఇవ్వకుండా బ్యాంకు నుంచి నరేష్ మిత్రుడైన మేళ్లచెర్వు మండలం రామాపురం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి రంగిశెట్టి వెంకటరావు ద్వారా డబ్బు డ్రా చేయించారు.

వాటలు పంచుకొని

వచ్చిన డబ్బులను అందరూ కలిసి వాటాలు పంచుకున్నారు. మొత్తం 44 చెక్కులకు సంబంధించి రూ.15,83,500 విలువ కాగా, అందులో ఎనిమిది చెక్కులు వివిధ కారణాలతో విత్‌డ్రా కాలేదు. 36 చెక్కులకు సంబంధించి మొత్తం రూ.13.63లక్షలు డ్రా చేసి నకిలీ లబ్ధిదారులకు కమీషన్ రూపంలో రూ.1.18లక్షలు ఇచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి నిందితుల నుంచి మిగిలిన డబ్బులో చెడపంగు నరేష్ నుంచి రూ.1.40లక్షలు, మర్ల వీరబాబు నుంచి రూ.90వేలు, ఉప్పల మధు నుంచి రూ.2.50లక్షలు, రాంబాబు నుంచి రూ.2.50లక్షలు, గుంటుక సందీప్ నుంచి రూ.2లక్షల నగదుతో పాటు ఆరు వాడని చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ క్యాంపు కార్యాలయంలో పనిచేసిన ప్రైవేట్ వ్యక్తులు లబ్ధిదారుల పేర్లు మార్చి మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు తెలియకుండా సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల విషయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, కోదాడ పట్టణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు కె.శివశంకర్, శివకుమార్, కోదాడ పట్టణ, సీసీఎస్ ఎస్ఐలు హనుమానాయక్, హరిక్రిష్ణ, సిబ్బంది కర్ణాకర్, శ్రీనివాస్, సైదులు, ఆనంద్, మల్లేష్, సతీష్, ఎల్లారెడ్డి, ప్రభాకర్, శివక్రిష్ణ, శ్రీనివాస్, సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

లెక్కల మాయాజాలం

(5వ పేజీ తరువాయి)

కొనుగోలు, రైతు బజార్‌లో కూరగాయలు తదితర ఆహార పదార్థాల కొనుగోలులో విక్రయదారులు చెప్పిందే లెక్కగా ఉంటుంది. పలు వస్తువులను కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు బేరమాడుతుండటం సర్వసాధారణం, అందుకు తగ్గట్టుగానే వ్యాపారులు ధరలను తగ్గిస్తునే బిల్లు తీసుకునే సమయంలో మాయాజాలం చేస్తున్నట్టు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా మ్యాజిక్కులు అధికంగా కిరాణం, రైతుజబార్‌లో ఉంటున్నట్టు తెలుస్తోంది. ఓ సామాన్యుడు కిరాణం దుకాణంలో తన బడ్జెట్‌కు అనుగుణంగా పలు వస్తువులు కొనుగోలు చేస్తాడు. ఈ మేరకు కొన్ని దుకాణాల్లో మనకు అర్థంకాని రీతిలో తెల్ల పేపర్‌పై వస్తువులు, ధరలు వేసి బిల్లును చూపించగానే డబ్బు చెల్లిస్తుండటం పరిపాటి. మరికొన్ని దుకాణాల్లో బిల్లు వేయకుండానే కాలిక్యులేటర్‌లో కూడికలు వేసి చెప్పగానే మారు మాట్లాడకుండా బిల్లు చెల్లించి సామగ్రి తీసుకుని వస్తుంటాం. రైతుబజార్, కూరగాయల విక్రయాల దుకాణాలు, సంతల్లో కూడా కాలిక్యులేటర్ లెక్కలే ఫైనల్. కొనుగోలు చేసిన కూరగాయలు ధరలన్నింటినీ కాలిక్యులేటర్‌లో కూడి చెప్పగానే పైసలు ఇచ్చి వేస్తుంటారు. ఇదంతా విక్రయదారులపై కొనుగోలుదారులకున్న విశ్వాసమే. కానీ, ఈ విశ్వాసాన్ని పలువురు వ్యాపారులు అదనుగా తీసుకొని తప్పుడు లెక్కలు వేస్తూ పరోక్ష దోపిడీకి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొనుగోలు చేసిన కూరగాయలను తూకాన్ని పేర్కొంటూ కాలిక్యులేటర్‌లో మాత్రం అధిక తూకం, అధిక ధరలతో లెక్కలు వేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. లెక్కల తేడాలు గుర్తించేవారు అత్యల్పంగా ఉండటం, ఆ తరహా వారు నిలదీస్తే హడావుడిలో పొరపాటయిందంటూ లెక్కలను సరిచేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ తరహా దోపిడి కొనుగోలు చేసిన కూరగాయలు ధరలో 10నుంచి 20శాతం వరకు ఉంటున్నదని ఒక అంచనా. అనగా వాస్తవ ధరలు, వాస్తవ తూకం ఆధారంగా రూ.200 విలువైన పలు రకాల కూరగాయలు కొనుగోలు చేస్తే సుమారు రూ.20 వరకు అధికంగా చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఇదే తరహా అక్రమ తంతు పలు కిరాణం, ఇతర దుకాణాల్లో సాగుతోంది. అలాగే ఫుటపాత్ వ్యాపారుల్లో, ఒకే దుకాణంలో పలు వస్తువులు కొనుగోలు చేసిన సందర్భాల్లో అక్రమ బిల్లింగ్ నిత్య కృత్యంగా ఉంటోంది.

కిలో ధరనే

నిత్యావసర వస్తువులు, కూరగాయలు తదితర ఆహార పదార్థాల ధరలు కిలో ప్రామాణికంగా పరిగణిస్తారు. ఎంత మొత్తంలో కొనుగోలు చేసినా సుమారుగా కిలో ధర ఆధారంగానే బిల్లు చేస్తుంటారు. కాస్త ఎక్కువ పరిమాణంలో కొనుగోలు చేస్తే ధరలను కొద్దిగా తగ్గిస్తుంటారు. కానీ కిలోలోపు అర, పావుకిలో, అంతకు తక్కువగా గ్రాముల్లో కొనుగోలు చేస్తే వ్యాపారులు ధరలను పెంచేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయలేని వినియోగదారులపై వ్యాపారులు అధిక ధరలతో ఆర్థిక భారం మోపుతున్నారు. కిలోలోపు కొనుగోలు చేస్తున్న వినియోగదారులే అధికంగా ఉంటుండటంతో వ్యాపారులకు లాభసాటిగా మారుతుండగా కొనుగోలుదారులు అధిక ధరలతో మోసపోతున్నారు.

అప్రమత్తతతోనే నివారణ సాధ్యం

అప్రమత్తతతోనే అధిక చెల్లింపుల ముప్పును తప్పించుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు. రైతుబజార్ సహా ఏ దుకాణం, ఎక్కడైనా కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు ధరను నిక్కచ్చిగా అడిగి తెలుసుకోవాలి. తూకాన్ని జాగ్రత్తగా గమనించాలి. వ్యాపారి చేప్పిన బిల్లుపై అనుమానం ఉంటే మొహమాటం లేకుండా ధర, తూకం, బిల్లు బేరీజు వేసుకోవాలి. అది సాధ్యం కానీ పరిస్థితుల్లో ప్రతి కొనుగోలు, ధర ఆధారంగా పేపర్‌పై లెక్క చేయించాలి. ఇలా అడగటం మన హక్కు అని వినియోగదారులు గుర్తుంచుకోవాలి. లేనిపక్షంలో నిలువు దోపిడీకి సిద్ధంగా ఉండాలి. అలాగే కిరాణం తదితర బిల్లులను కనీసం ఇంటి వద్ద అయినా పరిశీలించి అనుమానం వస్తే వెనక్కి వెళ్లి వ్యాపారిని ప్రశ్నించాలి. అలాగే పలు కారణాలతో కిరణం తదితర దుకాణాల్లో నెల ఖాతాలు పెడుతుండటం సర్వసాధారణం, అయితే ఈ లెక్కల్లో కూడా తేడాలు వస్తున్నాయని పలువురు వాపోతుంటారు. కానీ ప్రశ్నిస్తే వ్యాపారులు ఖాతా బంద్ చేస్తారేమోననే భయంతో వెనకాడుతున్న సందర్భాలు ఉంటున్నాయి. పరిష్కార మార్గంగా ఖాతా పెట్టే వినియోగదారులు తప్పనిసరిగా సొంత ఖాతా పుస్తకాన్ని నిర్వహించుకోవాలి. కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు, ధరను వారి వద్ద ఉండే ఖాతా పుస్తకంలో వ్యాపారితో నమోదు చేయించుకోవడం మంచిది. ఈ విషయంలో డబ్బులు ఊరికే రావు అంటూ ఓ ప్రముఖ జ్యూవెలరీ సంస్థ ప్రకటనను గుర్తుంచుకుంటే మంచిదేమో.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కేతేపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అన్నారు. ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రం కేతేపల్లిలో ఆ పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాలకు వీధుల్లో చేరిన మురుగు నీటి గుంతలను పరిశీలించారు. అనంతరం చినవెంకులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమల ఉధృతి పెరిగి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. వీధులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి పాముల బెడద తీవ్రమవుతుందన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులను మెరుగు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు ఎల్.రాజు, వి. సౌడయ్య, సీహెచ్.లింగయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నగల దుకాణంలో చోరీ ఘటనలో ఇద్దరి అరెస్టు

• రూ.60లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం • మిగిలిన నేరస్థుల కోసం కొనసాగుతున్న గాలింపు • వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపిస్తున్న సూర్యాపేట ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్‌లో గల శ్రీసాయి సంతోషి నగల దుకాణంలో చోరీ కేసులో పురోగతి కనిపిస్తోంది. చోరీకి పాల్పడిన వారిలో ఇద్దరిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ. 60లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.92వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వివరాలు వెల్లడించారు. సూర్యాపేటలోని ఎంజీ రోడ్‌లో గల శ్రీసాయి సంతోషి నగల దుకాణంలో జూలై 20వ తేదీ అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు సుమారు రెండున్నర కిలోల బంగారు ఆభరణాలతో పాటు కొంత నగదు అపహరించారు. దుకాణ యజమాని కిశోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాంకేతిక పరి జ్ఞానంతో కేసు దర్యాప్తు చేస్తున్న సమయంలో చోరీకి పాల్పడిన వారిని పోలీసులు గుర్తించారు. చోరీ ఘటనకు సంబంధమున్న వ్యక్తులతో కొన్ని నెలల పాటు కలిసి జీవించిన, చోరీ ఘటన గురించి ముందే తెలిసిన ఖమ్మం పట్టణానికి చెందిన యశోదను జూలై 27న సూర్యాపేట కొత్త బస్టాండ్‌వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండ డంతో అదుపులోకి తీసుకుని విచారించారు. చోరీచేసిన వ్యక్తుల గురించి సమాచారం ఇచ్చింది. చోరీచేసి వెళ్లే సమయంలో దొంగలు ఆమెకు 14తులాల బంగారు ఆభరణాలు ఇచ్చారు. వాటిని విక్రయించేందుకు వెళ్తూ పోలీసులకు పట్టుబడింది. ఆమె వద్ద నుంచి 14 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

మహిళ ఇచ్చిన సమాచారంతో

సదరు మహిళ ఇచ్చిన సమాచారంతో కేసు విచారణను మరింత ముమ్మరం చేయగా, చోరీ కేసులో ఏడుగురు ఉన్నట్లు గుర్తించారు. వారిలో నేపాల్‌కు చెందిన ప్రధాన నిందితుడు ప్రకాష్ అనిల్‌కుమార్, నేపాల్‌కు చెందిన అమర్‌భట్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తులు ఉన్నట్లు నిర్ధారించారు. ఉన్నతాధికారుల అనుమతితో ప్రత్యేక పోలీస్ బృందాలు బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, నేపాల్ సరిహ ద్దుల్లో గాలించాయి. సాంకేతిక ఆధారాలను సద్వినియోగం చేసుకుని పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దక్షిన్ దినాజ్‌పూర్ జిల్లా బైహోర్ గ్రామం తపన్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన మాలిక్ మొల్లను ఈనెల 11న అతడి స్వగ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి పోలీసుల సాయంతో సాక్షుల సమక్షంలో రూ.60లక్షల విలువైన 554గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.87వేల నగదు స్వాధీనం చేసుకు న్నారు.

ప్రత్యేక బృందాలతో గాలింపు

అదే విధంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని బలార్‌ఘట్‌లోని జిల్లా కోర్టులో న్యాయమూర్తి వద్ద నేరస్తుడు మాలిక్‌మొల్లను ప్రవేశపెట్టి ఏడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి తీసుకుని నిందితుల రాష్ట్రాల బదిలీ(ట్రాన్సిట్) నిబంధనల ప్రకారం సూర్యాపేటకు తీసుకొచ్చినట్లు తెలిపారు. చోరీ చేసినవారికి ఆశ్రయం కల్పించడం, చోరీకి రెక్కీ చేయడంలో సాయం చేసిన నేపాల్‌కు చెందిన ఖమ్మంలో గుర్కాగా పనిచేసే అమల్‌భట్‌ను ఖమ్మంలో అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.5వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి పాల్పడిన వారిలో ఒకడైన మాలిక్‌మొల్లను విచారణ చేయగా చోరీలో నేపాల్‌కు చెందిన ప్రకాష్‌అనిల్‌కుమార్, నేపాల్‌కు చెందిన కడక్‌సింగ్ అహల్ వాలియా, నేపాల్‌కు చెందిన పురస్‌ప్రసాద్‌జోషి, పశ్చిమ బెంగాల్‌కు చెందిన జషిమొద్దిన్‌లతో కలిసి చోరీచేసినట్లు అంగీకరించాడు.

రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం చోరీ

ముందుగానే రెక్కీ నిర్వహించి నగల దుకాణం వెనుకభాగం నుంచి గ్యాస్ కట్టర్ సాయంతో బాత్‌రూం గోడకు రంధ్రం చేసి అందులో నుంచి దుకాణంలోని వెనుకభాగంలోని వెళ్లి బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, కొంత నగదును అపహరించినట్లు ఒప్పుకున్నాడు. నగల దుకాణంలో సమీపంలో అద్దెకు తీసుకున్న ఇంటికి వెళ్లి చోరీ చేసిన బంగారు ఆభరణాలు, నగదును ఐదు భాగాలుగా పంచుకుని ఖమ్మంలో ఉండే యశోద, అమర్‌భట్‌ల వద్దకు వెళ్లి వారికి ఖర్చుల కోసం కొంత బంగారు ఆభరణాలు, నగదు ఇచ్చి వెళ్లినట్లు తెలిపాడు. చోరీ కేసులో ప్రధాన నిందితుడు ప్రకాష్‌అనిల్‌కుమార్, అమర్‌భట్ ఇద్దరు ఖమ్మంలో గుర్కాగా పని చేస్తున్నారు. డబ్బులు సరిపోక ఖమ్మంలో చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చి సూర్యాపేటలో నగల దుకాణంలో చోరీ చేసేందుకు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడ్డారు. చోరీ కేసులో నేపాల్‌కు చెందిన ప్రధాన నిందితుడు ప్రకాష్‌అనిల్‌కుమార్, కడక్‌సింగ్ అహలి హలియా, పురస్‌ప్రసాద్‌జోషి, పశ్చిమబెంగాల్‌కు చెందిన జషిమొద్దిన్ పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. కేసులో నేరస్తులను పట్టుకున్న పోలీసులను అభినందించి వారికి రివార్డులు అందజేశారు. సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్నకుమార్, పట్టణ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, శివకుమార్, ఎస్ఐలు హరిక్రిష్ణ, శివతేజ, గోపిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..ఆరోగ్యం

- శ్రావణ మాసం కావడంతో మహిళలు ఉపవాసానికి మొగ్గు
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు వైద్యుల సూచనలు పాటించాలి

(ఆంధ్రజ్యోతి -చింతపల్లి)

నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంతో పాటు వేంకటేశ్వరనగర్(మాల్)లో మహిళలు, యువతులు ఆధ్యాత్మికత వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా వాసవీమాత, సంతోషిమాత, వరలక్ష్మి మాత, గ్రామదేవతలను నిత్యం భక్తిభావంతో పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం శ్రావణమాసం కావడంతో మహిళలు ఉదయం, సాయంత్రం వేళ ల్లో తలస్నానం ఆచరించి ఉపవాస దీక్షలు ఉండి తమ ఇష్టదైవాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. అయితే మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఉపవాసానికి దూరంగా ఉండడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఉపవాస దీక్షలు చేయడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుంది.ఉపవాసం ఉన్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అంశాలను తెలియజేస్తూ ప్రత్యేక కథనం.

శ్రావణమాసంలో భక్తులు రోజు ఒక్కపూట భోజనం చేస్తారు. వరుస పండుగలను పవిత్రంగా భావించే చేసే ఉపవాసాలు ఆరోగ్యానికి ఎంతో మే లు చేకూరుతుందని ఆధ్యాత్మిక పండితులు, వైద్య నిపుణులు చెబుతున్నారు.

పాటించాల్సిన నియమాలు ఇవే..

ఉపవాస దీక్షను పాటించాలనుకునేవారు తగు జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. ప్రధానంగా అల్సర్, మధుమేహం, ఉన్నవారు, గర్భిణులు బాలింతలు, వృద్ధులు ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు వైద్యుల సూచనల ప్రకారం కచ్చితంగా ఆహారం తీసుకోవాలి.

పోషకాల శాతం..

ప్రకృతి సిద్ధమైన నిత్యం తినే పండ్లలో ఎన్నో పోషక విలువలు కలిగి ఉంటాయి. ఇందులో కొబ్బరి నీళ్లు, లాంటి వాటిల్లోనూ అనేక విటమిన్లు ఉంటాయని నిపుణులు వివరించారు.

పదార్థాల్లో ఉండే శక్తి	కేలరీల్లో
పాలు 250 ఎంఎల్	150
పండ్ల రసం 250ఎంఎల్	130 .
చిలగడ దుంప (స్వీట్ పొటాటో)	130
5 ఖర్జూరాలు	120
శనగలు కప్పు	200
రాగి మాల్ట్ 200 (ఎంఎల్)	150
వెజ్ సూప్ కప్పు	180



చింతపల్లి మండలకేంద్రంలోని సాయి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు (ఫైల్)


జాగ్రత్తలు పాటించాలి



ఉపవాసంలో అన్నం తినకూడదనుకుంటే ద్రవ పదార్థాలు తీసుకోవచ్చు. బాదం పలుకులు కూడా తినవచ్చును. ఉపవాసాలతో ఆరోగ్యం బాగుపడాలే కానీ క్షీణించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. రాత్రిళ్లు తినడం, ఆలస్యంగా నిద్రపోవడం ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఉప్పు మానేసి, సహజ సిద్ధ ఆహారం తీసుకోవడం వల్ల కొంత వరకు మేలు జరుగుతుంది.

- శ్రీదేవి, వైద్యాధికారి, చింతపల్లి

అనేక ప్రయోజనాలు



సాత్వికాహారంతో భవంతుడి సన్నిధానంలో నామస్మరణతో సన్నిహితంగా నివసించడమే ఉపవాసానికి పరమార్థం. ఉపవాసాలతో శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, వైజ్ఞానికంగా అనేక ప్రయోజనాలు ఉంటాయి.

వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ,
పండితుడు వెంకటేశ్వరనగర్

కొడుకు ప్రేమ వివాహం

కుమార్తెల పేరిట ఆస్తి వీలునామా రాసిన తండ్రి

- దుకాణం ముందు బైఠాయించిన నవ దంపతులు



దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న జ్ఞానేశ్వర్, సౌమ్య

భువనగిరి టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పెద్దల అనుమతితో చేసుకున్న ప్రేమ వివాహం చివరికి వరుడి కుటుంబంలో చిచ్చు పెట్టింది. ఈ మేరకు భువనగిరి పట్టణానికి చెందిన వ్యాపార కుటుంబానికి చెందిన జ్ఞానేశ్వర్ తన స్నేహితురాలైన గుండాల మండలం సుద్దాలకు చెందిన సౌమ్యతో ఇరు కుటుంబాల అంగీకారంతో నాలుగు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. కానీ అప్పటినుంచి ఆగ్రహంగా ఉన్న జ్ఞానేశ్వర్ తండ్రి శనివారం తన ఆస్తిని తన ఇద్దరు కుమార్తెల పేరిట వీలునామా రాయడంతో పాటు కొడుకు, కోడలును ఇంటి నుంచి వెళ్లిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతేకాక కొడుకు పై దాడి చేశాడు. దీంతో ఆ నవ దంపతులు దుకాణం ముందు ధర్నాకు దిగారు. చివరికి పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరడంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. కానీ ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది.

నేడు దేవరకొండలో పింఛన్‌దారుల మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు నరేష్‌మాదిగ

కొండమల్లేపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు అన్ని రకాల చేయూత పింఛన్లు రూ.4వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆది వారం నిర్వహించనున్న దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో జరిగిన చేయూత పింన్‌దారుల సమావేశంలో మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్ డబ్బులు పెంచాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ మండల ఇన్‌చార్జి అందుగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ, వంగూరి ప్రసాద్, బన్ని, ఇద్దయ్య, జాను, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



కాల్వ పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకుల బృందం

నల్లగొండరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బీవెల్లెంల ప్రాజెక్టు పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ మండలంలోని అప్పాజీపేట గ్రామంలో అసంపూర్తిగా వదిలేసిన బీవెల్లెంల ప్రాజెక్ట్ కాల్వల పనులను సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పనుల కింద కాల్వలు తవ్వకుండా వదిలేశారని, చెరువులు కుంటలు నింపడానికి అసంపూర్తిగా ఉన్న కాల్వలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల గడిచినా ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులను గాలికి వదిలేసి గాలి మోటార్‌లో తిరుగుతున్నారని విమర్శించారు. శ్రీశైలం సొరంగ మార్గం పనులు పూర్తి చేస్తామని, పనులు చేసేందుకు వచ్చి చనిపోయిన కూలీల శవాలను కూడా బయటకు తీయలేని దుస్థితి నెలకొందని అన్నారు. బీవెల్లంల ప్రాజెక్టు కేవలం పర్యాటకకేంద్రంగా మారే పరిస్థితి ఉందని ప్రాజెక్ట్ కింద కాల్వలు ఒక్కటి కూడా పూర్తి చేయలేదని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసమర్థత వల్లే కాల్వలు పూర్తి కావడం లేదని అన్నారు. ప్రాజెక్టు కాల్వలకు డబ్బు లేదనే సాకు సరికాదని, రైతులకు అవసరమైన ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

ఎస్ఎల్‌బీసీ కింద ఉన్న అనేక కాల్వలకు నిధులు కేటాయించకుండా పిల్ల కాల్వలను వదిలేశారని అన్నారు. కేవలం చెరువులు, కుంటలు నింపడానికి మాత్రమే ప్రాజెక్టు పనికొచ్చే విధంగా చేశారని అన్నారు. వెంటనే పిల్ల కాల్వలు పూర్తి చేసి రైతుల పంట పొలాలకు నీరందించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రాజెక్టులపై పెద్ద ఎత్తున ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, నాయకులు కొండ అనురాధ, పోలే సత్యనారాయణ, కొండ వెంకన్న, బొల్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

- స్వామిని దర్శించుకున్న 48వేల మంది భక్తులు ● నిత్య ఆదాయం రూ.50.84లక్షలు



ఉత్సవమూర్తులకు హారతి నివేదిస్తున్న ప్రధానార్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మూడు రోజుల పాటు (శుక్ర, శని, ఆదివారం) వరుస సెలవుల నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉభయ క్యూలైన్లల్లో రద్దీ నెలకొంది. రూ.500 టికెట్టుతో 1,284 వాహనాలు కొండపైకి చేరుకోగా రూ.6.42లక్షల ఆదాయం, బ్రేక్ దర్శన టిక్కెట్ల ద్వారా రూ.4.44లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 48వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా ప్రత్యేక దర్శనానికి అరగంట, ఉచిత దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటో దిగేందుకు పోటీపడ్డారు. భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేశారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. ఇదిలా ఉండగా, యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామికి శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.50,84,453 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావ్ తెలిపారు. కాగా, ప్రతి వారం జరిగే సంగీత సభల్లో భాగంగా మహతి మ్యూజిక్ అకాడమీ (హైదరాబాద్) వీణవాద్యం భక్తులను ఆకట్టుకుంది.

ప్రముఖుల రాక

స్వామివారిని దర్శించుకునేందుకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి రాజ్‌నీష్‌గుప్తా, తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా వేర్వేరుగా యాదగిరిగుట్టకు వచ్చారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. ఇరు కుటుంబాలకు వేద మండపంలో పండితులు వేదాశీర్వచనం చేయగా, అధికారులు లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

కొనసాగుతున్న కృష్ణమ్మ, మూసీ పరవళ్లు

- సాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద
- 20 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

నాగార్జునసాగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక స్వల్పంగా పెరిగింది. దీంతో సాగర్ 20 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి 1,44,694 క్యూసెక్కుల వరద రాక ఉండగా, శనివారం సాయంత్రానికి 1,99,544 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఇదిలా ఉండగా, శనివారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 587.50 అడుగులకు చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 587.50 అడుగులుగా (305.8030 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 2,067 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,217 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్‌గేట్లలో 20 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 1,56,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,95,450 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 1,99,544 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. వరద కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

ఎడమ కాలువకు నీటి విడుదల పునరుద్ధరణ

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాలువలకు శనివారం సాయంత్రం ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను పునరుద్ధరించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ నెల 13వ తేదిన ఎడమ కాలువకు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. వర్షాలు తగ్గడంతో మరల శనివారం సాయంత్రం ఎడమ కాలువకు నీటి విడుదలను పునరుదద్ధరించారు. ఇదిలా ఉండగా శనివారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.50 అడుగులకు చేరుకుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 587.50 అడుగులుగా (305.8030 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 6006 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలులవ ద్వారా 2067 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,217 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని,26 క్రస్టు గేట్లలల్లో 20 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 1,56,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడులద చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,95,450 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 1,99,544 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది,వరద కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీకి మళ్లీ పెరిగిన వరద ఉధృతి



మూసీ ప్రాజెక్టు 4క్రస్టుగేట్లతో వరద నీరు

కేతేపల్లి/ వలిగొండ/ శాలిగౌరారం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో పది రోజులకు పైగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నదికి చేరిన వరద నీరంతా దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టు 10 రోజులుగా వరద నీటితో పొంగి పొర్లుతోంది. ఈ క్రమంలో శుక్రవారం భారీగా వచ్చిన ఇన్‌ఫ్లో శనివారం ఉదయానికి కొంత తగ్గుముఖం పట్టండంతో పాటు రోజంతా భారీగా వరద నీటి విడుదలతో ప్రాజెక్టు నీటిమట్టం అడుగు మేర తగ్గి 641.80అడుగులకు పడిపోయింది. దీంతో శుక్రవారం ప్రాజెక్టు 9క్రస్టుగేట్లు ఎత్తి 11వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలిన అధికారులు శనివారం ఉదయం 4, 5, 6, 7, 12నెంబరు క్రస్టుగేట్లను పూర్తిగా మూసి వేశారు. అలాగే 3అడుగులు ఎత్తి ఉన్న ప్రాజెక్టు 2, 3, 8, 10నెంబరు క్రస్టుగేట్లను 1అడుగుకు తగ్గించి వరద నీటి విడుదలను 2460క్యూసెక్కులకు చేర్చారు. ఇన్‌ఫ్లో 13254.45క్యూసెక్కులుగా నమోదయ్యింది. శనివారం ఉదయం 10గంటల ప్రాంతంలో ఎగువ ఇన్‌ఫ్లో క్రమంగా పెరిగి 12007.26క్యూసెక్కులుగా నమోదయ్యింది. దీంతో అప్పటి వరకు 1అడుగు మేర ఎత్తి ఉంచిన క్రస్టుగేట్లను 2అడుగులకు పెంచిన అధికారులు 8633.86క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 139.86క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.30అడుగులు (3.78టీఎంసీలు)గా ఉంది. వలిగొండ మండలంలోని సంగెం గ్రామపరిధిలో భీమలింగం వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగెం బొల్లెపల్లి గ్రామాల నడుమ ఉన్న కల్వర్టు పైనుంచి వరద నీరు అంతకంతకూ పెరుగుతోంది. ముందస్తుగా అధికారులు ఆ మార్గం గుండా రాకపోకలను నిలిపివేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలం మానాయికుంట గ్రామాల మధ్యనున్న మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తూ పలువురిని ఆకర్షిస్తోంది.

డిండికి దండిగా కొనసాగుతున్న వరద



అలుగుపోస్తున్న డిండి రిజర్వాయర్‌ను సందర్శిస్తున్న పర్యాటకులు

డిండి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దుందుభివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో డిండి రిజర్వాయర్‌కు వరద ప్రవాహం దండిగా(ఎక్కువగా) కొనసాగుతోంది. ఎగువ నుంచి 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ శనివారం తెలిపారు. అంతే మోతాదులో దిగువకు నీరు విడుదల అవుతోందన్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 36అడుగులు(2.4 టీఎంసీలు) గరిష్టస్థాయికి చేరింది. దీంతో గత మూడు రోజులుగా డిండి రిజర్వాయర్ ఓవర్‌ఫ్లో అవుతుండడంతో ప్రాజెక్టుకు సందర్శకుల తాకిడి పెరిగింది. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న డిండి రిజర్వాయర్ వద్ద శ్రీశైలం వెళ్లే యాత్రికులు కొద్దిసేపు ఆగి డిండి రిజర్వాయర్ అందాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్నారు.

నేడు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 17 వ తేదీన పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లోగల విద్యుత్ పోల్ క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అవిశెట్టి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 9441364104 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జ(నా)ల సవ్వడి

- కళకళలాడిన నాగార్జునసాగర్ పరిసరాలు
- లాంచీస్టేషన్ వద్ద ఇబ్బందులు పడిన పర్యాటకులు



లాంచీ వద్ద పర్యాటకుల రద్దీ

నాగార్జునసాగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లో ఓ వైపు జల సవ్వడి, మరో వైపు జనసందడి నెలకొంది. నాగార్జునసాగర్ 20 క్రస్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో వరుస సెలవుదినాలు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో సాగర్ పరిసరాలన్నీ పర్యాటకులతో సందడిగా మారాయి. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి వెళ్లే దారితో పాటు ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ సరిహద్దులో ఉన్న కొత్త వంతెనపై కూడా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో సీఐ శ్రీనునాయక్ తన సిబ్బందితో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సాగర్‌కు వచ్చే వాహనాలను పాత పోలీస్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయించారు.

పోటెత్తిన పర్యాటకులు

వరుస సెలవు దినాలు కావడంతో సాగర్‌కు శనివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, కొత్త వంతెన, జలవిద్యుత్ కేంద్రం, అనుపు, ఎత్తిపోతల తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు తరలివెళ్లారు. దీంతో నాగార్జునకొండకు నాలుగు ట్రిప్పుల లాంచీలు, జలాశయంలో మూడు జాలీ ట్రిప్పులు లాంచీలు నడిపినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.

లాంచీలో పరిమితికి మించి పర్యాటకులు

సాగర్‌కు ఎగువ నుంచి వరద ఉధృతంగా వస్తున్నా జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు వెళ్లే పర్యాటకులను లాంచీల్లో పరిమితికి మించి ఎక్కించారని పర్యాటకులు ఆరోపిస్తున్నారు. ఒక్కో లాంచీలో 150మందికి సరిపడా సీట్లు, లైఫ్ జాకెట్లు ఉన్నా ఒక్కొక్క లాంచీకి 300 మందిని ఎక్కించారని పర్యాటకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల వరకు కూడా కొంత మంది పర్యాటకులను నాగార్జునకొండపై వదిలేశారని పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ పర్యాటకశాఖ పర్యాటకుల భద్రతను ఏ మాత్రం పట్టించుకోకుండా కనీసం లైఫ్ జాకెట్‌లు కూడా లేకుండా లాంచీలను ఎలా నడుపుతారని పలువురు పర్యాటకులు అప్రశ్నిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తమ ప్రాణాలకు ఎవరు బాధ్యులని పర్యాటకులు వాపోతున్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రిని కలిసిన డీసీసీబీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించినందుకుగాను శనివారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలతో వ్యవసాయాన్ని పండుగగా మారుస్తుందన్నారు. సహకార బ్యాంకుల బలోపేతం కోసం మరో ఆరు నెలల పాటు పాలకవర్గాల గడువును పొడిగించినట్లు తెలిపారు. పాలకవర్గాలు రైతుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పథకాలను అమలుచేయాలని సూచించారు. అనంతరం డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 3వేల కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి నర్సమ్మ కృషి

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి నర్సమ్మ కృషి చేసిందని నవ తెలంగాణ ఎడిటర్ రాంపెల్లి రమేష్, మాజీ ఎంపీపీ కొత్తగట్టు మల్లయ్యలు అన్నారు. శనివారం తిరుమలగిరి మండలంల తాటిపాముల గ్రామానికి చెందిన నాయకురాలు కారుపోతుల నర్సమ్మ(92) చెందడంతో ఆమె మృతదేహంపై ఎర్ర జెండా కప్పి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో చంద్ర నారాయణ, కాంతయ్య, సోమన్న, మల్లేష్, లింగయ్య, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు చేయించాలి

నూతనకల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో మండలంలో దెబ్బతిన్న రహదారులకు ప్రభుత్వం మరమ్మతు చేయించాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రతి గ్రామంలో రహదారులు అధ్వానంగా మారాయని, వెంటనే ప్రభుత్వం మరమ్మతు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో మధు, సైదులు, శ్రీను, రవి, వెంకన్న పాల్గొన్నారు.

ఎట్టకేలకు వంతెన పనులకు మోక్షం

● వంతెనకు రెండువైపులా గ్రావెల్‌తో నిర్మాణం
● రూ.60 లక్షలతో శ్రీనివాసపురం - అమరవరం గ్రామాల మధ్య వంతెన

హుజూర్‌నగర్ ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం-అమరవరం గ్రామాల మధ్య నాలుగేళ్ళ క్రితం ప్రారంభించిన వంతెన పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. నాలుగేళ్ల క్రితం నిర్మించిన వంతెనకు శనివారం గ్రావెల్ పోసి మరమ్మతులు చేశారు మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి వంతెన డైవర్షన్ రోడ్డు పొంగి పొర్లింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. నాలుగేళ్ల క్రితం శ్రీనివాసపురంలో రూ.60లక్షలతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండు తూముల మేరకు వంతెనను నిర్మించి వదిలేశారు. బిల్లులు రానందున క కాంట్రాక్టర్ పనులు చేయలేదని గ్రామస్థులు తెలిపారు.

పనులు పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశం

ఇదిలా ఉండగా నాలుగేళ్ల నుఏంచి డైవర్షన్ రోడ్డు నుండే రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో అమరవరం, శ్రీనివాసపురం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రెండు రోజుల క్రితం హుజూర్‌నగర్‌కు వచ్చిన మంత్రికి వివరించడంతో వారం రోజుల్లో పనులు పూర్తిచేయాలని, అదేవిధంగా పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఇదిలా ఉండగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లింగగిరి నుంచి యాతవాకిళ్ల వరకు సుమారు 10కిలో మీటర్ల మేర రూ.22 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ పనులు ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తూ రూ.22కోట్ల నిధులు మంజూరుచేయించడంతో పనులు పూర్తిచేయాలని, వంతెన పనులు కూడా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ వంతెనకు రెండువైపులా శనివారం గ్రావెల్ పోసి మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి వంతెనకు ఇరువైపుల నుంచి భారీగా వరదనీరు వెళ్లడంతో డైవర్షన్ రోడ్డు తెగి రాకపోకలకు ఆగాయి. ఈ నేపథ్యంలో వంతెన ప్రాంతంలో గ్రావెల్ పోసి మరమ్మతులు చేశారు.మరమ్మతులు చేయించినందుకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, అమరవరం పీఏసీఎస్ వైస్ చైర్మన్‌ఉస్తెల శ్రీనివాసరెడ్డి, లింగగిరి సొసైటీ చైర్మన్ కట్టా గోపాల్ రావు, కర్నాటి వీరనాగిరెడ్డి, శింగతల వెంకటరెడ్డి తదితరులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



వంతెన వద్ద గ్రావెల్ వేయిస్తున్న అధికారులు

మెరిట్ విద్యార్థులకు ఉపకారవేతనాలు

హుజూర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఆర్య వైశ్య విద్యార్థులకు సెప్టెంబరు 7న ఉపకారవేతనాలు పంపిణీ చేయనున్నట్లు ఆవోపా అధ్యక్షుడు వంగవీటి సతీష్, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాస్ తెలిపారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్యవైశ్య పేద మెరిట్ విద్యార్థులు ఉపకారవేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కాగా ఉపకార వేతనాలతో పాటు పేద మహిళలకు పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

వంతెనకు మరమ్మతులు

నూతనకల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లసింగారం గ్రామ శివారులో పాలేరు వాగుపై సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న వంతెన భారీ వరదలకు కూలింది. స్పందించిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి కూలిన వంతెన వద్ద శనివారం రాళ్లు, మట్టి వేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

మడేలయ్య దేవాలయ ఉత్సవాలు ప్రారంభం

మునగాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలో రజక సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెద్ద చెరువు గట్టు శివాలయ ప్రాంగణ సమాపంలో మడేలయ్య దేవాలయాన్ని నూతనంగా నిర్మించారు. రజకుల కులదైవం శ్రీసీతాలమ్మ సమేత మడేలయ్యస్వామి ఆలయ ప్రారంభోత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా శనివారం సీతాలమ్మ మడేలయ్య, పోతురాజుల విగ్రహాలను ప్రత్యేక ట్రాక్టర్‌పైకి చేర్చి మునగాల గ్రామంలో ఊరేగించారు. దేవాలయంలో మూడు రోజుల ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను ఈ నెల 18న ప్రతిష్ఠించనున్నారు. ు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు ముక్కోళ్ల వెంకటేశ్వరరావు, దేవాలయ కమిటీ అధ్యక్షులు తంగెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

చివ్వెంల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయాలని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం చివ్వెంల మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులను రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు ఆత్మగౌరవంతో బతికేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో వేణుమాధవరావు, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, డీటీ జ్యోతి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసిన వాజపేయి

భానుపురి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోఖ్రాన్ అణుపరీక్షలను మాజీ ప్రధాని వాజపేయి హయాంలో నిర్వహించి దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేశారని సూర్యాపేట మునిసిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. మాజీ ప్రధాని వాజపేయి వర్ధంతి సందర్భంగా శనివారం సూర్యాపేటలోని పట్టణ బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, ఎండీ అబిద్, చల్లమల్ల నర్సింహ, పొలగాని ధనుంజయ్‌గౌడ్, రంగరాజు రుక్మారావు, లక్ష్మణ్‌రావు, ఆకారపు పరిపూర్ణచారి, బండ్లపల్లి శ్రీనివాస్, కోడి లింగయ్య, రవి, రవీందర్, జగన్ తదితరులు ఉన్నారు.

దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలి

కోదాడ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కోదాడలోని ఓ దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు మేకల శ్రీను కోరారు. శనివారం కోదాడలో ఆయన మాట్లాడుతూ కోదాడ పట్టణంలో కూరగాయల మార్కెట్ వెనుక వీధిలోని ఓ వస్త్ర దుకాణంలో ఓ మహిళ దుస్తులు కొనుగోలు చేశారన్నారు. అవి నాణ్యతతో లేనందున సదరు మహిళ రిటర్న్ చేయబోగా ఆ దుకాణం యజమాని దురుసుగా మాట్లాడారన్నారు. ఆ వ్యాపారి జీరో వ్యాపారం చేస్తున్నందున జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తుంగతుర్తి, నూతనకల్, నేరేడుచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో తుంగతుర్తి నియోజకవర్గంలో పంటు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. శనివారం తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేర్పుల లక్ష్మయ్య, కమటం బుచ్చాలు, బాబు, ముజ్జిగ వెంకటేష్, నల్లగంటి నరేష్ పాల్గొన్నారు.

● వర్షాలతో పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని నూతనకల్ మండలం ఎర్రపహాడ్ మాజీ సర్పంచ్ లింగా బిక్షం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నూతనకల్‌లో ఆయన మాట్లాడారు. మిర్యాల గ్రామ శివారులో మూడు ఎకరాల్లో పెసర, కంది పైర్లు నీట మునిగి నష్టం వాటిల్లినా, వ్యవసాయ, రెవిన్యూ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

● భారీ వర్షాలకు పంట పొలాలు దెబ్బతిన్నందున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నేరేడుచర్ల మండలంలోని గంటవారిగూడెం గ్రామంలో దెబ్బతిన్న వరి పైర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరదకు గంటవారిగూడెం కల్వర్టు మొత్తం కొట్టుకుపోయిందన్నారు. రైతు రావుల సత్యం పొలం ఇసుక మేటతో నిండిందన్నారు. . చాలా మంది రైతులు నష్టపోయారని, అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కల్వర్టు ప్రాంతంలో వంతెనను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రావుల సత్యం, శ్రీను, వీరేంద్రనాయుడు ఉన్నారు.

మహా యోగ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కోదాడ, కోదాడ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో ఈ ఏడాది డిసెంబర్ 13న నిర్వహించనున్న మహాయోగ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యోగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకట్ అన్నారు. శనివారం పట్టణంలో మహాయోగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల్లో యోగా విద్యను కేజీ టు పీజీ వరకు పాఠ్యాంశంగా ప్రభుత్వం అమలు చేయాలన్నారు. నేటితరం విద్యార్థులు ఒత్తిడికి అధికంగా లోనవుతున్నారని యోగాతో ఒత్తిడిని అధికమించవచ్చని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని క్రోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, చెన్నకేశవరావు, నవీన్, రంగారావు, కృష్ణమూర్తి, ఏడుకొండలు, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ సాంస్కృతిక సేవ మండల ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు

తుంగతుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ఆంజనేయులుని టీపీసీసీ సాంస్కృతిక సేవ మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. శనివారం మండల కేంద్రంలో ఆంజనేయులుకి జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షులు ఎర్ర అనుదీప్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొమ్ము ఆంజనేయులు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే సామేలు, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి చక్రాల రఘు, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా అనురాధ కిషన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తడకమల్ల పరశురాములు, కొమ్ము అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

నేరేడుచర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెంది ఆదాంబికి లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం రూ.10,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, బట్టు మధు, యూసుఫ్, సరికొప్పుల నాగేశ్వరావు, కందిబండ శ్రీనివాసరావు, విశ్వనాథం, శ్రీనివాసరావు, చిలకరాజు శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తుంగతుర్తి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తడకమల్ల రామచంద్రమ్మ, ఎనగందుల జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అయా కుటుంబాల సభ్యులను మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శనివారం పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి



హుజూర్‌నగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న సాకేత్ ప్రభు భక్తులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌వర్క్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలని జాతీయ హరేరామ-హరేకృష్ణ సంస్థ ప్రభూజీ నాంపల్లి సాకేత్‌కుమార్ కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రజాభవన్ టౌన్‌హాల్‌లో హరేరామ-హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంకీర్తనలు, పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. అనంతరం కృష్ణుడి వేషధార ణలో చిన్నారులు అలకరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్జి ప్రభాకర్, సాదినేని రాంప్రసాద్, చారి, సుందర్, రామ్‌చరణ్, అశ్వనికుమార్, సందీప్, రమేష్, లక్ష్మీ, మురళి, సరిత పాల్గొన్నారు.

● సూర్యాపేటలోని శబరినగర్ అయ్యప్ప దేవాలయంలో శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించారు. చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో సందడి చేశారు.



సూర్యాపేటలో ప్రత్యేక శ్రీకృష్ణుడి అలంకరణలో చిన్నారులు



నూతనకల్‌లో గోపిక వేషధారణలో చిన్నారి

● నేరేడుచర్లలోని పలు ప్రైవేటు పాఠశాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంజలి స్కూల్‌లో చిన్నారులు కృష్ణుడి వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అలక సైదిరెడ్డి, అలక సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మేళ్లచెర్వు మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి గ్రామ సేవ నిర్వహించారు. యాదవులతో ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. . రేవూరులోని రుక్మిణి సత్యబామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● నూతనకల్, అర్వపల్లి మద్దిరాల మండల కేంద్రాల్లో యాదవుల ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

● కోదాడ కోదాడ పట్టణంలోని తేజ పాఠశాలలో చిన్నారులు, శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలతో వేడుకల్లో పాల్గొన్నారు.ఉట్లు కొట్టి సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా కోదాడలోవని ప్రగతి మహిళ మండలిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు నూనె సులోచన, కోశాధికారి కల్పన పాల్గొన్నారు.



నేరేడుచర్లలో చిన్ని కృష్ణులు

● మునగాలలోని రామలింగేశ్వర ఆలయం సమీపంలో యాదవులు ఉట్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకన్న, కాంచాని కృష్ణమూర్తి, గురువులు, బుర్రా లింగయ్య, గడ్డం వెంకన్న, జంగిలి గోపి పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని కాపుగల్లు గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, చైత్ర సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కోదాడ శాఖ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు, ముత్తవరపు సుబ్బారావు, శైలజ, చందన, వంగాల మహేష్, విజయ, జాస్తి శివరామకృష్ణ, రమ్య, రాము, సైదేశ్వరరావు పాల్గొన్నారు.

● గరిడేపల్లిలో శ్రీకృష్ణుడికి డోలారోహణం, శ్రీకృష్ణ తులాభారం నిర్వహించారు.. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో నూకల గగన్‌రెడ్డి, అనన్యలు అలరించారు.



కోదాడలోని తేజ పాఠశాలలోఉట్టికొడుతున్న చిన్నారులు

యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు

మఠంపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రసుత్త వానకాల సీజన్‌లో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మహిళా రైతులు క్యూ లైన్లలో చెప్పులు పెట్టి పడిగాపులుగాస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన ఎత్తిపోతల పథకాలను అడ్డుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నేడు ఆ పథకాలను పూర్తి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరుగుపిచ్చయ్య, కేఎల్ఎన్‌రెడ్డి, జగన్‌నాయక్, కడియం వెంకటరెడ్డి, సురేష్‌బాబు, ఇస్లావతు బాలాజీనాయక్, కె.లక్ష్మీనరసింహరాజు, కోటానాయక్, సైదులు, బి.రామారావు, పుల్లారెడ్డి, హాఫీజ్‌ఖాన్, నాగయ్యయాదవ్‌పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి

కోదాడ టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం కోదాడలోని బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన వన మహోత్సవంలో ట్రస్టు సభ్యులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యాదా శ్రీనివాసరావు, యాద సుధాకర్, జగన్, ఈ. ప్రసాద్, వెంపటి వెంకటనారాయణ, పత్తి నరేందర్, వెంపటి ప్రసాద్, సాయి, బెలిదె అశోక్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కృష్ణస్వామి ఆశయ సాధన కోసం కృషి చేస్తాం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ ఆశయసాధన కోసం నిరంతరం కృషిచేస్తామని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు అన్నారు. కృష్ణస్వామి జయంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహం ఎదుట ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు కృష్ణస్వామి అని కొనియాడారు. స్వాతంత్ర సమర యోదుడిగా, పాత్రికేయుడిగా ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేశారని, ముదిరాజ్ సంఘ వ్యవస్థాపకుడిగా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు మదనాచారి, శ్యాం, నాగేంద్రబాబు, మధు, కిరణ్, ముత్యం, నాగరాజు, ముక్క సందీప్, ఉమేష్ పాల్గొన్నారు.

20నుంచి ప్రజా సమస్యలపై సర్వే

కోదాడ రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై గ్రామాల్లో, పట్టణాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి నెల రోజుల పాటు సర్వే చేసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తారమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముల్కలపల్లి రాములు అన్నారు. శనివారం కోదాడలోని సుందరయ్య భవన్లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయమని అన్నారు ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం కోదాడ పట్టణ కార్యదర్శి మిట్టగనుపుల ముత్యాలు, సీపీఎం జిల్లా నాయకుడు జుట్టుకొండ బసవయ్య, పట్టణ కమిటీ సభ్యుడు దాసరి శ్రీను, కేవీపీఎస్ నాయకుడు జంగపల్లి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

గరిడేపల్లి, ఆగస్టు 16 ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎప్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూలగుండ్ల సీతారాంరెడ్డి అన్నారు. మండంలోని కల్మలచెర్వు గ్రామంలో ఏడుగురి మంజూరైన రూ. 2.84 లక్షల విలువైన సీఎంఆర్ఎప్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బచ్చలకూరి మట్టయ్య, కృష్ణప్రసాద్, యోహాన్, సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రేమ్, నట్టే నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సూర్యాపేట టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన మాక్సీ విజన్ శరత్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఈనెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అశ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాం సుందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రెగ్యులర్ ఉద్యోగులు స్వద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 9951020552కు సంప్రదించాలని సూచించారు.

యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించాలని తెలంగాణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పొరెళ్ల విప్లవ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గుండెపురి గ్రామంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలేదని, రాజీవ్ యువ వికాసం పథకాన్ని దరఖాస్తు స్థాయిలోనే వదిలేసారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువజన సంఘం నాయకులు ముద్రబోయిన అనిల్, బొడ్డు రమేష్, తెలుగు కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక మహాసభలను విజయవంతం చేయాలి

మునగాల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) భవన నిర్మాణ కార్మిక మహాసభలను విజయవంతం చేయాలి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర బసవయ్య కోరారు. శనివారం మండల కేంద్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం మండల కేంద్రంలో జరిగే కార్మిక మహాసభలకు కార్మికుల అదిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కే దస్తగిరి, నాగేంద్రబాబు, కోలా ఆంజనేయులు, సైదా, జాన్‌పాష, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జగదీష్‌రెడ్డి పరామర్శ

నూతనకల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లసింగారం గ్రామానికి చెందిన కట్ట సత్తిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి శనివారం పరామర్శించారు.


వర్షాలతో దెబ్బతిన్న పంటలు

ఆత్మకూర్(ఎస్), పెనపహాడ్ ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, పంటలు పూర్తిగా నిండి అలుగులు పోస్తున్నాయి. అక్కడక్కడ వరద రోడ్లపై ప్రవహిస్తున్నందున రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిదిలోని నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ వద్ద రహదారిపై నీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

● పెన్‌పహాడ్ గ్రామశివారులో వాగు వద్ద రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తున్నందున వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులు, పశువులు వెళ్లలేక పోతున్నాయి. మాధవరం చెరువు వద్ద 100 ఎకరాల్లో పైర్లు నీట మునిగాయి. ఈ వాగులో బైక్ కొట్టుకుపోతుండగా స్థానికుల సాయంతో బయటికి తీశారు.

ధ్వంసమై రోడ్డుకు అడ్డుగా మిషన్ భగీరథ పైపులైన్

● వృథాగా వెళుతున్న నీరు ● వాహనాల రాకపోకలకు ఆటంకం



మేళ్లచెర్వులో రోడ్డుకు అడ్డంగా పడిన మిషన్ భగీరథ పైపు

మేళ్లచెర్వు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమై రోడ్డుకు అడ్డంగా పడి తాగునీరు వృథాగా పోతోంది. మేళ్లచెర్వులో నాథుల చెర్వు అలుగు పక్క నుంచి జంగాల కాలనీ తాగునీటి అవసరాల కోసం చెరువు అలుగు పక్కగా మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటుచేశారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించినందున మిషన్ భగీరథ పైపు ధ్వంసమై రోడ్డుకు అడ్డంగా మూడు రోజులు క్రితం పడింది.దీంతో ఈ రోడ్డు నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్లే వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ధ్వంసమైన పైపులైన్‌ను పునరుద్ధరించి తాగునీటికి, వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రిడ్ అధికారులకు సమాచారం అందించాం

మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసమైందని వాటర్ గ్రిడ్ అధికారులకు సమాచారం అందించాం.వీలైనంత త్వరంగా పైపులైన్ మరమ్మతు చేయిస్తామని చెప్పారు

● నరేష్, ఏఈ, మిషన్ భగీరథ

చేపపిల్లల పంపిణీ ఎప్పుడో?


(5వ పేజీ తరువాయి)

వారికి ఆర్థిక భరోసా కలుగుతోంది.

గతంలో నాణ్యతలేని చేప పిల్లలు సరఫరా

గత ఏడాది జిల్లాలోని చెరువుల్లో చేపల పెంపకానికి సరఫరా చేసిన పిల్లలు నాణ్యంగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అవి ఆశించిన స్థాయిలో ఎదగలేదని పలువురు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేపలు వదిలే సమయాల్లో కనీసం కాంట్రాక్టర్ ఎన్ని చేప పిల్లలు సరఫరా చేశాడో లెక్క తెలియని పరిస్థితి నెలకొంది. చేప పిల్లల సరఫరాలో గత ఏడాది పెద్ద మొత్తంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. చేప పిల్లలను డబ్బాల్లో, ప్యాకెట్లలో తెస్తుంటారు. కనీసం డబ్బాలో ఎన్ని చేప పిల్లలు ఉన్నాయి? అనే విషయాన్ని ఏ అధికారీ పర్యవేక్షించడం లేదు. కాంట్రాక్టర్ చెప్పిన లెక్కనే వారు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈసారైనా అధికారులు చేప పిల్లలను సరఫరా చేసే సమయాల్లో చేప పిల్లల లెక్కింపులో వాస్తవికత ఉండేలా చూడాలని, సైజు ప్రకారం సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. 80 నుంచి 100 ఎంఎం సైజు రకం, 35 నుంచి 40ఎంఎం సైజు మరో రకం చేపలను ఏటా చెరువుల్లో విడుదలచేస్తున్నారు.

టెండర్ ప్రక్రియ త్వరగా ప్రారంభించాలి



రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి. సరైన సమయంలో చేప పిల్లలను వదలకపోవడంతో ఎదుగుదల లేక దిగుబడి రావడంలేదు. అధికారులు గతంలో మాదిరిగానే కావాలనే టెండర్ ప్రక్రియ ఆలస్య చేస్తున్నారు.

● ఈదుల యాదగిరి, మత్స్యకార్మిక సంఘ నాయకుడు

ఆదేశాలు రాగానే టెండర్ ప్రక్రియ

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తాం. ప్రస్తుతం వరద నీటితో పాటు చేపలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. మత్స్యకార్మికులను ఆదుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది.

●నాగులునాయక్, మత్స్యశాఖ అధికారి